www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

Follow:

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ , అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను, సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



ఆదివారం 06-09 - 2026

సంపుటి : 2 సంచిక : 127

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com


## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు రేవంత్ సర్కార్పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం...

**వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**సమస్యలనుగాలికొదిలేసిమ వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ**

**ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ**



కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల

2వ పేజీలో...




## రెండేళ్లు సమయం ఇవ్వండి...

**ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ**

హైదరాబాద్ 05: రెండు సంవత్సరాలపాటు సహకరించి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నిరుపేదల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టిన ఈ దశలో తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రి దామోదర రాజనర్సింహ , ప్రభుత్వ

2వ పేజీలో...



## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా

**: రఘునందన్ రావు**

**సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం**

**12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏ లో చేర్చారన్న రఘునందన్ రావు**

**ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్**

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు.పటాన్చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమా వేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబి తాలో పెట్ట డంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని

2వ పేజీలో...



2వ పేజీలో...

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో టీసీఎస్ ప్రతినిధుల బృందం సమావేశం

హైదరాబాద్ 05: తెలంగాణలో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఏర్పాటు కానుండటం తెలంగాణను ప్రపంచ ఏఐ మ్యాప్‌లో మరింత ముందుకు తీసుకెళ్లే చరిత్రాత్మక పరిణామమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టుతో హైదరాబాద్ గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా ఎదగడంతో పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని చెప్పారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో టీసీఎస్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి , కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్ , సీఓఓ ఆర్తి సుబ్రమణియన్ , హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న , హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందారు, అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు పాల్గొన్నారు.ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న నేపథ్యంలో, ఆ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా



## 22ఏ భూముల అంశం గంభీరమైన సమస్య ఎంపి ఈటల

2వ పేజీలో...

హైదరాబాద్ 05: 22 ఏ బాధితులకు అండగా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మహా దీక్ష కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరయ్యారు.ఈటల రాజేందర్ మాట్లాడుతూ - మిస్టర్ రేవంత్ రెడ్డి, మిస్టర్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి మా భూములు 22 ఏ లో పెట్టే అధికారం మీకు ఎవడిచ్చాడు. ఈరోజు కుత్బుల్లాపూర్ గిరినగర్లో పేదల ఇళ్లను కూలుస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ ను గద్దె దించేవరకు విశ్రమించేది లేదని శపథం చేస్తున్నాం. 22 ఏ వల్ల ఎక్కువ వేదన అనుభవిస్తుంది మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు. 22 ఏ బాధితులు స్వచ్ఛందంగా బస్సులు కట్టుకొని మరీ వచ్చారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులారా "యస్ బాస్'' అని పని చేస్తే జైళ్ళపాలవుతారని హెచ్చరిస్తున్నాం. వారి ఆదేశాలతో ప్రజల కళ్ళల్లో మట్టికొట్టిన వారిని వదిలిపెట్టేది లేదు. శ్రీలక్ష్మి, ఆచార్యలకు పట్టిన గతి మీకు పట్టకుండా

## అప్పుడు యూత్ డిక్లరేషన్..ఇప్పుడు రేవంత్ బూతు డిక్లరేషన్

**జీవో 97 పై కాంగ్రెస్ సర్కార్ ను అసెంబ్లీలో ఎండగడతాం ... కేటీఆర్**



2వ పేజీలో...

కరీంనగర్05: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సతీష్ కుమార్ మరియు ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నరు. నేను అడుగుతున్నా.. ఎవరు రాజీనామా చేయాలి. రాజీనామా ఎందుకు చేయాలి? తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? రాజీనామా ఎవరు చేయాలి? రేవంత్ రెడ్డి అనే బట్టేబాజ్ గాడు రాజీనామా చేయాలి 100 రోజులు అని చెప్పి 1000 రోజులు మోసం చేసిన దొంగబాజ్ గాడు రాజీనామా చేయాలి నిరుద్యోగులను నిండాముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్. ఆ రోజు కూడా ఇదే కరీంనగర్లో, 2006లో ఇదే కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్ రాజీనామా చేయాలని మాట్లాడారు. ఇదే కరీంనగర్ గడ్డ మీద కేసీఆర్ రాజీనామా



## గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం

**మూడు కేసుల్లో 460 మొక్కలు స్వాధీనం .. నలుగురు అరెస్టు**

2వ పేజీలో...

జననినాదం,సిర్పూర్(యు), సెప్టెంబరు 05: ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమ గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. సిర్పూర్(యు) పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూర్నూర్ గ్రామపంచాయతీ పరిధి జీర్లగాట్, గుట్టగూడ గ్రామ శివారుల్లో శనివారం




## ఉపాధ్యాయుల మాట వినండి..

**జీవితానికి బంగారు బాట వేసుకోండి**

**గంజాయి సమాచారం కోసం 1908.. సైబర్ మోసాలకు 1930.. అత్యవసర పరిస్థితుల్లో 112**

2వ పేజీలో...

గోదావరిఖని05 :విద్యార్థులు ఉపాధ్యాయుల మాటకు గౌరవం ఇస్తూ,వారి సూచనలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.చెడు వ్యసనాలకు, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్‌లోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎన్టీపీసీ టీటీఎస్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్,సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా

# రెండేళ్లు సమయం ఇవ్వండి...

మొదటిపేజీ తరువాయి...

సలహాదారు కే కేశవరావు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భారతదేశ మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఆర్థిక వెసులుబాటును బట్టి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. మిగతా శాఖలతో పోల్చితే విద్యా శాఖ ఆదర్శంగా నిలబడాలి. పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకులు మీరే. రెండేండ్లు సమయం ఇవ్వండి. రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికి విజ్ఞప్తి చేస్తున్నా. రెండేండ్లలో సమస్యలన్నింటినీ సామరస్యంగా మీరు అడక్కుండానే పరిష్కరించే బాధ్యత నాది'' అని స్పష్టం చేశారు."తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక రోల్ మాడల్‌గా నిలబెడుదాం. అందుకు కథానాయకులు ఉపాధ్యాయులే. అందుకు ఉపాధ్యాయులంతా పునరంకితం కావాలి. ఇంట్లో సొంత పిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దాలనుకుంటున్నారో మీ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల విషయంలోనూ అంతే శ్రద్ధ పెట్టాలి. ఉపాధ్యాయులపై నాకు సంపూర్ణమైన విశ్వాసం ఉంది.ప్రభుత్వ సర్వీసులో మీరు 30 ఏళ్లకు పైగా సేవలందిస్తారు. రాజకీయ నాయకులం ప్రతి ఐదేళ్లకు ఒకసారి మీముందుకొచ్చి పరీక్షలు రాయాల్సిందే. నేను చెప్పిన ప్రకారం చేయకుండా ఉంటే.. నిర్ణయం తీసుకోవలసింది మీరే. అందుకు మార్కులు వేయాల్సిందీ మీరే. మీ చేతిలోనే కలం ఉంది. మీ చేతిలోనే బలం ఉంది" అని ముఖ్యమంత్రి గారు వ్యాఖ్యానించారు. "ఉపాధ్యాయులే వీధుల్లోకి వస్తే ప్రభుత్వానికి, రాష్ట్రానికి శుభ సూచకం కాదు. మిగతా శాఖలు వేరు. పిల్లల భవిష్యత్తుకు నిర్దేశకులు మీరు. మీరే ధర్నాలు చేస్తానంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ముఖ్యమంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా. రెండేళ్లు సమయం ఇవ్వండి. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను. పీఆర్సీ, ఇంక్రిమెంట్‌లతో పాటు మిగతా సమస్యలు వేటిలోనూ చిన్న కష్టం రానివ్వను. సలహాదారు కేశవరావు గారితో కూర్చొని మాట్లాడండి. నన్ను విశ్వసించి సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు."గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. విధ్వంసం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే శక్తి ఉపాధ్యాయులపైనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయంటే ఆ గొప్పతనం ఉపాధ్యాయులదే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి వివాదం లేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించాం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించాం. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే కాదు ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్ నియమించి ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురావడానికి ప్రయత్నం చేసింది. ఉపాధ్యాయుల ఆలోచనలను పరిగణలోకి తీసుకుని సాంకేతిక నైపుణ్యంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాం.ప్రభుత్వ విధానంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి. మనమంతా లక్షలాది విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఉన్నాం. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. సహకరించండి. నిస్సందేహంగా ఈ ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరిస్తుంది" స్పష్టంగా చెప్పారు. ''జాతీయ విద్యా విధానంతో విద్యా రంగంలో ఎన్నో మార్పులొస్తున్నాయి. మనం కూడా విధానాలు మార్చుకోవాలి. నిరుపేద పిల్లలు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆశిస్తున్నారు. కాలం తీరిపోయిన విద్యా విధానంతోనే వెళదామా. అప్ డేటెడ్ విద్యా విధానాన్ని అందిపుచ్చుకుందామా?పాలిటెక్నిక్ కాలేజీలు టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమ నాలెడ్జ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేస్తే, ప్రైవేటీకరణ చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడం వల్ల ఈరోజు ఫలితాలను చూస్తున్నాం. పాలిటెక్నిక్‌లో రెండేళ్లు థియరీ, మూడో సంవత్సరం కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌గా పనిచేసే విధానం తీసుకొస్తున్నాం. ఇంటర్న్‌గా ఉన్నప్పుడు కార్పొరేట్ కంపెనీలు రూ. 9 వేల వరకు స్టయిఫండ్ కూడా ఇస్తాయి. పాలిటెక్నిక్ ఇప్పటివరకు డిప్లమాలే జారీ చేస్తున్నాయి. విదేశాల్లో మాస్టర్స్ చదువుకోవడానికి వీలుగా డిగ్రీ పట్టాను అందించే విధంగా మార్పులు చేశాం. పాలిటెక్నిక్ పూర్తి చేస్తే ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరడానికి అవకాశం కోల్పోతామన్న తప్పుడు ప్రచారంపై విద్యార్థులు మోసపోవద్దు. నిస్సందేహంగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరడానికి వీలుంది. అందులో ఎలాంటి మార్పు ఉండదు. అలాగే లెక్చరర్లకు సర్వీసు నిబంధనల విషయంలోనూ ఎలాంటి ధోకా ఉండదు. సర్వీస్ రూల్స్ వేరు, విద్య విధానం వేరు. ఈ విషయంలో ఇంకా అనుమానాలు ఉంటే సలహాదారు కేశవరావు తో కూర్చొని మాట్లాడండి. ప్రభుత్వం తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయి. జీతభత్యాలు, పీఆర్సీ, ఇంక్రిమెంట్లు నష్టం కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది" అని విస్పష్టం చేశారు. "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో స్కిల్స్ నేర్పించడానికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి ఏటీసీలు మార్చాం. కార్పొరేట్ కంపెనీల సమన్వయంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలను ప్రారంభించాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్య (నాలెడ్జ్ అండ్ కమ్యునికేషన్) ను అందించి 12వ తరగతి తర్వాత నైపుణ్యంలో శిక్షణ ఇప్పించాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ప్రపంచంలో రాణించగలరు. ఇంజనీరింగ్ పట్టా ఉన్న వారికన్నా నైపుణ్యం ఉన్నవారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి'' అని వివరించారు."ప్రపంచ వ్యాప్తంగా ఫోకస్ మారింది. స్కిల్స్ ఉన్నవారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియా లాంటి దేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. స్కిల్స్ తర్వాత ఇన్నొవేషన్ అండ్ ఎంప్లాయిమెంట్ వైపు దృష్టి సారించాలి. యూనికార్న్‌గా నిలబడాలి. ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఈనాడు ఎలాన్ మస్క్ కంపెనీతో పోటీ పడుతోంది. ఇన్నొవేషన్‌పై ఫోకస్ పెట్టాలి. ఇలాంటి వాటిల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. వాటన్నింటికీ వారధి, సారథులు ఉపాధ్యాయులే. రెండేళ్లు ఫోకస్డ్‌గా పనిచేయండి. ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకోండి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిద్దాం" అని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. "పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు. విద్యా రంగంలో జాతీయ సగటులో 28 స్థానంలో ఉన్న తెలంగాణను 17వ స్థానానికి ఎదగడం ఉపాధ్యాయుల వల్లే సాధ్యమైంది. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేలకు పైగా విద్యార్థులు అధికంగా అడ్మిషన్లు తీసుకున్నారంటే ఆ విజయానికి టీచర్లే కారణం. 30–35 ఏళ్లు కష్టపడి ప్రజలకు సేవలు అందించి రిటైరైన తర్వాత బెనిఫిట్స్ ఇవ్వకపోగా పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 చేయడం వల్ల 2025 నుంచి రిటైర్మెంట్లు మొదలయ్యాయి. గత ప్రభుత్వం దాదాపు 8 వేల కోట్ల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెడితే, ఎక్కడెక్కడ అవకాశం ఉందో అక్కడ నిధులను కూడదీసి వంద రోజుల్లో రూ. 6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం చెల్లించాం" అని గుర్తుచేశారు.

# 22ఏ భూముల అంశం

## గంభీరమైన సమస్య ఎంపి ఈటల

మొదటిపేజీ తరువాయి...



చూసుకోండి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి వచ్చామని మర్చిపోకండి. మూసీ పక్కన ఇళ్లను కూలుస్తామంటూ ఫణిగిరి కాలనీకి దానకిషోర్ అనే సీనియర్ మోస్ట్ ఐఏఎస్ అధికారి వందలమంది అధికారులను, పోలీసులను, బుల్డోజర్లను తీసుకొని వచ్చిండు. 5 నుండి 10 కోట్ల విలువైన అపార్ట్మెంట్లును కూలుస్తా అంటే ఎవడబ్బ జాగీరు అని రెండు రోజుల పాటు ఎర్రటి ఎండలో కూర్చొని కాపాడుకోగలిగినమని అన్నారు.రేవంత్ రెడ్డి నీకు కేసీఆర్ కంటే దుర్మార్గమైన గతి పడుతుంది. లక్షల మందిని చంపిన నియంత హిట్లర్ ను క్రూరుడు అని ప్రపంచం గుర్తు పెట్టుకుంటే, అలాంటి దుర్మార్గ పాలన అందించేది రేవంత్ అని చరిత్రలో గుర్తు పెట్టుకుంటారు. పొంగులేటి 22 ఏ నిషేధిత జాబితాలో మా అధికారులు పెట్టొచ్చు అని మాట్లాడుతున్నాడు. ఈ జీవో ఇచ్చింది మీరు కాదా ? అఅఐం 22 ఏ గురించి 11.09.2025 న కలెక్టర్లకు లేఖ రాసింది. – మేడ్చల్ కలెక్టర్ 22.11.2025 న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కి లేఖ రాస్తే.. 02.12.2025 న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వాళ్ళు సర్క్యులర్ ఇచ్చారు. ఇది మీ అందరికీ పంపిస్తా నంగనాచి మాటలు మాట్లాడుతున్న మంత్రులారా కబర్దార్ అని హెచ్చరిస్తున్నా. అనాలోచింత కాదు బ్లాక్ మెయిలింగ్ వెపన్ గా వాడుకునేందుకు తెచ్చిన జీవో ఇది. రాహుల్ సోనియా లకు నెలకు నాలువందల కోట్ల రూపాయలు పంపించేందుకు చేసిన దుర్మార్గ కుట్ర ఈ ఆలోచన. – కొన్ని దరఖాస్తులు మాత్రమే వచ్చాయి అని మంత్రి చెప్తున్నారు.. ఒక్క నర్సాపూర్ లో 55 వేల మంది రైతుల భూములను ఈ జాబితాలో పెట్టారంటే ఎంత గంభీరమైన సమస్య అర్థం చేసుకోవచ్చని అన్నారు.

# ఉపాధ్యాయుల మాట వినండి..

మొదటిపేజీ తరువాయి...

హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రులే తొలి గురువులని,వారి తర్వాత ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు,వ్యక్తిగత జీవితం లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా వారితో మాట్లాడితే సరైన మార్గనిర్దేశం లభిస్తుందని అన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు,ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర ఆపద సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు కాల్ చేయాలని విద్యార్థులకు వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న 100 నంబర్ స్థానంలో ప్రస్తుతం 112 అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల భద్రత కోసం పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఏసీపీలు,సీఐలు, ఎస్‌హెచ్ఓలు పాఠశాలల పరిసరాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు.అయితే విద్యార్థులే తమ భద్రతకు తొలి రక్షకులని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని, భవిష్యత్తులో ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని సీపీ ఆకాంక్షించారు.వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన "వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు" అనే అవగాహన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ బి.రామ్‌రెడ్డి ఆవిష్కరించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్న రీతిలో వివరిస్తూ ఈ పోస్టర్‌ను రూపొందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్,రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జయరాజ్, స్థానిక కార్పొరేటర్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో టీసీఎస్ ప్రతినిధుల బృందం సమావేశం

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అవుతుందని చెప్పారు.హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్‌తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ కోసం దాదాపు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి.ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని అభివృద్ధి చేయనున్నారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, వాటర్–న్యూట్రల్ డిజైన్‌తో పర్యావరణ అనుకూలంగా క్యాంపస్‌ను తీర్చిదిద్దనున్నారు.ఈ భారీ పెట్టుబడితో ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అన్నారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు మరింత బలం చేకూర్చనుంది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డిరు, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక , పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య , డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి , ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మూడు వేర్వేరు కేసులకు సంబంధించి 460 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలతో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగుకు పాల్పడుతున్నట్లు గుర్తించిన గెడం లోబాజీ, గెడం జయవంత్, కుమ్రా మాధవరావు, పెందోర్ సూర్యబాను లను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు జీర్లగాట్ ప్రాంతానికి చెందినవారు కాగా, మరో వ్యక్తి గుట్టగూడ గ్రామానికి చెందినవాడిగా పోలీసులు తెలిపారు.

**కేసులు నమోదు..**నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి సాగుకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. **కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ నితికా** గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వతోపాటు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ నితికా పంత్ స్పష్టం చేశారు. గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా లేదా ఈ కార్యకలాపాలకు సహకరించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నా, మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక నిఘా, తనిఖీలు కొనసాగిస్తూ అక్రమ సాగు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

# అప్పుడు యూత్ డిక్లరేషన్.. ఇప్పుడు రేవంత్ బూతు డిక్లరేషన్

మొదటిపేజీ తరువాయి...

చేస్తే ఏమైందో గుర్తుందా అని అడిగారు.2006లో కాంగ్రెస్ వీపు పగిలింది. ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో.. అగో ఆయననే కేసీఆర్.. ఆయనతో పెట్టుకోవద్దు. ఇప్పుడు కేసీఆర్తో పెట్టుకుంటే రేవంత్ రెడ్డి మళ్లీ అదే అవుతది.. యాదిలో పెట్టుకో! చేసిన మోసాలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు 420 హామీలకు 420 సార్లు రాజీనామాలు చేయాలి.ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి. గుర్తుపెట్టుకోండి.. నేను కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నా. పోరాటాలకు పురిటిగడ్డ కరీంనగర్. కరీంనగర్ నుంచే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలుపెట్టారు.యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద వాళ్లే దిగిపోయారు.ఉడుకు నెత్తురు ఉరకలెత్తితే పోరాటం పోటెత్తుతుంది.యువత పిడికిలి బిగిస్తే పిడుగుల వర్షం కురుస్తుంది. మాకు స్కిల్ లేదని ఎవరు చెప్పారు.సీఎంకు స్కిల్ ఉందా అని విద్యార్థులు అడుగుతున్నారు. సీఎం రేవంత్కు దరఖాస్తు కూడా రాయడం రాదు. అక్షర దోషం లేకుండా ఏ భాషలోనూ రాయలేడు రేవంత్. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తాం. ఢిల్లీలో యువత కదం తొక్కితే మోదీ కేంద్ర ప్రభుత్వమే వణికింది. మోదీనే గడగడలాడించిన యువతకు ఈ కేడీ ఒక లెక్కనా? చరిత్రను మలుపు తిప్పింది యువత, విద్యార్థుల పోరాటాలే. కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్లు అభివృద్ధిలో నడిపించాం.అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో అనుకోని ఘోరం జరిగింది. తెలంగాణ ఇవ్వకుండా వేలాది ప్రాణాలు బలిగొన్న ముసలి నక్క కాంగ్రెస్. ముసలి నక్క కాంగ్రెస్ జిత్తులతో అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగుల మీద దొంగ ప్రేమ కురిపించారు. దేశం వదిలించుకున్న కాంగ్రెస్ పార్టీ పొరపాటు వల్ల మన నెత్తిన కూర్చుంది. కాంగ్రెస్కు జాక్పాట్.. తెలంగాణకు గ్రహపాటు అయ్యింది. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలన్నారు.వచ్చాయా యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.. చేశారా ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ చట్టం తెస్తామన్నారు.. తెచ్చారా కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా యువతకు రూ.10 లక్షల రుణాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా ఫీజు రీయింబర్స్మెంట్ వస్తుందా? రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.. ఇచ్చారా అప్పుడు యూత్ డిక్లరేషన్.. ఇప్పుడు రేవంత్ బూతు డిక్లరేషన్ హామీలు అమలు చేయలేదని ప్రశ్నిస్తే బూతులు మాట్లాడుతున్నాడని అన్నారు.మోసం చేసిన కాంగ్రెస్ నేతలను యువత చీరేసి చింతకు కట్టాలి. పందికొక్కుల్లాగా తినడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామాచేయాలంటున్నారు.తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా1000 రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్ రాజీనామా చేయాలి. నిరుద్యోగులను నిండా ముంచి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఉద్యోగాలు ఏమయ్యాయని అడిగితే బూతులు మాట్లాడుతున్నాడు. సీఎం, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. గాలి మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చారు. దండం పెట్టి ఓట్లేసిన ఉద్యోగులే మీకు పిండం పెడతారు. కాంగ్రెస్ కొన్ని తరాల పాటు కనిపించకుండా పోయే తీర్పు యువత చెప్పాలి. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అశోక్నగర్లో రాహుల్ అన్నారు. ఓట్లు వేయించుకొని అడ్రస్ లేకుండా పోయారు రాహుల్ గాంధీ.రేవంత్ దగ్గర నెలకోసారి పైసలు తీసుకొని సీఎం సీటును రెన్యువల్ చేస్తున్నారు. రాహుల్ మూటలు తీసుకుంటూ అన్నీ మూసుకొని ఢిల్లీలో కూర్చున్నాడు. మీరు రాకపోతే మేమే ఢిల్లీకి వస్తాం. నోటిఫికేషన్ లేదు.. లూటిఫికేషన్ మాత్రం నడుస్తోంది. జాబ్ క్యాలెండర్ లేదు.. రాష్ట్రంలో స్కామ్ క్యాలెండర్ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ కాలిబూడిదయ్యే దాకా నిరుద్యోగులు నిప్పుకణికలై మండాలని అన్నారు.

# సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు రేవంత్ సర్కార్పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం...

మొదటిపేజీ తరువాయి...

తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీవో 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా

మొదటిపేజీ తరువాయి...

ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 05:** సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే శక్తి కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి హాజరై ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమని తెలిపారు. తన శిష్యుల ఎదుగుదలనే గురుదక్షిణగా భావించే ఒకే ఒక వ్యక్తి ఉపాధ్యాయుడు మాత్రమే అని తెలిపారు. సమాచారం అంతా గుప్పిట్లోకి వచ్చిన ఈ రోజులలో కూడా ప్రత్యేక బోధననే పిల్లలు ఇష్టపడతారని, తరగతి గదిలో విద్యార్థులను "నువ్వు సాధించగలవు" అని ప్రోత్సహించి ముందుకు నడిపే మార్గదర్శకులు ఉపాధ్యాయులే అని తెలిపారు. గురువు దైవంతో సమానమని, విద్యార్థులు 100 శాతం బడికి వచ్చే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు. జిల్లాలో విద్యారంగం బలోపేతం దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ తరపున కలెక్టర్, అదనపు కలెక్టర్ లను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 05:** రాష్ట్రంలోని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో విద్యా పరిపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రతిష్ఠాత్మక ప్రతిభా పురస్కారం--2026 ను అందుకున్నారు. 2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 2025--26లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 2026--27లో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగి 2 వేల 554 మంది అదనంగా చేరారు. 2024--25తో పోలిస్తే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాలలో 10 శాతానికి పైగా నమోదు పెరిగింది. అలాగే 2026--27లో 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎం ఐ ఎస్, సి సి ఓ లు, సి ఆర్ పి ల సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టితో జిల్లాలో విద్యాభివృద్ధి సాధ్యపడింది. మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించింది.

# రోడ్డు కాదు.. గుంతల దారి..!

**వర్షాలకు కొట్టుకుపోయిన కౌటగాం--గీసుగూడ రహదారి..**



**జననినాదం,తిర్యాణి 05:** మండలంలోని కౌటగాం నుంచి గీసుగూడ, పునగూడకు వెళ్లే రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు, కాలువలు ఏర్పడడంతో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండడంతో వాహనాలను తోసుకుంటూ వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం పడితే రహదారి మరింత ప్రమాదకరంగా మారుతోంది. గీసుగూడ, పునగూడ గ్రామాల ప్రజలు నిత్యావసరాలు, వైద్యం, విద్య కోసం ఈ దారిపైనే ఆధారపడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా గ్రామాలకు చేరుకోలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# గంజాయి సాగుపై పోలీసుల నిఘా

**ఇద్దరి అరెస్ట్.. 22 మొక్కలు స్వాధీనం**




**జననినాదం,తిర్యాణి 05:** గంజాయి అక్రమ సాగుపై తిర్యాణి పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. మండలంలోని రెండు ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 22 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని రెబ్బెన సీఐ సంజయ్‌కుమార్ తెలిపారు. చిన్న అరటిపెల్లి గ్రామానికి చెందిన మేసినేని చంద్రయ్య గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అతడి వద్ద సాగు చేస్తున్న ఏడు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.70 వేలు ఉంటుందని తెలిపారు. మరో ఘటనలో మంగి తాళ్లపేట గూడకు చెందిన వెడ్మ జంగు గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అతడి వద్ద నుంచి 15 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ సాగు, విక్రయం, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సంజయ్‌కుమార్ హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని, గంజాయి సాగు లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎంఆర్‌పీఎస్ అండ

**జననినాదం,తిర్యాణి 05:** గంభీరావుపేట గ్రామంలో అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతిచెందిన జూలా నర్సయ్య కుటుంబానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు పుల్లూరి శ్యామ్, కరుగంటి బావన్న, గద్దేల మొగిలి, దేవునూరి నర్సయ్య, పడిగెల అమర్ మల్యాల మల్లేష్, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ వివరాల్లో తప్పులుంటే చెప్పండి

**నోటీసులు అందుకున్నవారు పత్రాలు ఇవ్వాలి**

**తహసీల్దార్ శ్రీనివాస్**



**జననినాదం,తిర్యాణి 05:** ఎస్ ఐ ఆర్ నోటీసులు అందుకున్న ప్రజలు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ కేంద్రంగా మంగి, కౌటగూడ, ముల్కలమంద గ్రామాలకు చెందిన నోటీసుదారుల వివరాలపై డేటా వెరిఫికేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించే వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి పరిశీలిస్తున్నామని చెప్పారు. అవసరమైన పత్రాలను అధికారులు, బీ ఎల్ ఓ, బీ ఎల్ ఏ లకు అందించాలని కోరారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా అర్హుల రికార్డులను సక్రమంగా సిద్ధం చేయడమే వెరిఫికేషన్ ఉద్దేశమని తెలిపారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ వివరాలను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్నాక గణపతి, మంగి సర్పంచ్ రాయిసిడం వినోద్, ముల్కలమంద సర్పంచ్ కుడ్మెత హనుమంతరావు, కౌటగూడ సర్పంచ్ కాత్లేలే మంజుల మధుకర్, మంగి ఉప సర్పంచ్ కనక శ్రీకాంత్, ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు, బీ ఎల్ ఓ, బీ ఎల్ ఏ లు పాల్గొన్నారు.

# తీజ్ ఉత్సవాలకు ఘనంగా ముగింపు

**తొమ్మిది రోజులుగా నియమ నిష్ఠలతో కొనసాగిన వేడుకలు**
**సాంప్రదాయబద్ధంగా తీజ్ బుట్టల ఊరేగింపు..**
**నిమజ్జనంతో ముగిసిన సంబరాలు**
**సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన లంబాడీ యువతులు**





**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి,లింగాపూర్ సెప్టెంబరు 05:** మండల వ్యాప్తంగా లంబాడీ గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన తీజ్ ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నియమ నిష్ఠలతో, సంప్రదాయ ఆచార వ్యవహారాలతో కొనసాగిన తీజ్ వేడుకలకు నిమజ్జన కార్యక్రమంతో ముగింపు పలికారు. తీజ్ బుట్టలను తలపై ధరించి మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఊరేగింపుగా తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు**

లంబాడీ గిరిజనుల సాంప్రదాయంలో తీజ్ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. పండుగ ప్రారంభం నుంచి తొమ్మిది రోజులపాటు తీజ్ బుట్టల్లో గోధుమ మొలకలను పెంచుతూ వాటిని పవిత్రంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉపవాసాలు, నియమ నిష్ఠలు పాటిస్తూ తీజ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి రోజు తీజ్ బుట్టల వద్ద సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి, పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. **సంప్రదాయ దుస్తుల్లో సందడి..** ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని వివిధ తండాలకు చెందిన లంబాడీ గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు, యువతులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు, ఆభరణాలతో అలంకరించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు సైతం సంప్రదాయ వస్త్రధారణలో తీజ్ బుట్టలను తలపై మోసుకుంటూ ఉత్సాహంగా కనిపించారు. దీంతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**తీజ్ బుట్టలతో ఊరేగింపు**

తొమ్మిది రోజులపాటు ఎంతో భక్తితో పెంచిన గోధుమ మొలకలతో కూడిన తీజ్ బుట్టలను తలపై పెట్టుకుని మహిళలు, బాలికలు సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా తరలివెళ్లారు. యువతులు, చిన్నారుల నృత్యాలు, సంప్రదాయ పాటలతో వేడుకలకు మరింత శోభ చేకూరింది. పెద్దలు ఆశీర్వాదాలు అందిస్తూ పండుగ విశిష్టతను వివరించారు. **నిమజ్జనంతో ముగింపు** తీజ్ బుట్టలను ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తీసుకెళ్లారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు పూర్తిచేసి తీజ్ బుట్టలను నిమజ్జనం చేయడంతో తొమ్మిది రోజుల వేడుకలకు అధికారికంగా ముగింపు పలికారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సంప్రదాయాలు, ఆచారాలను భవిష్యత్‌తరాలకుఅందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. **ఆకట్టుకున్న తీజ్ వేడుకలు** మండల వ్యాప్తంగా జరిగిన తీజ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో తండాలు సందడిగా మారాయి. సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సాగిన ఈవేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. తీజ్ నిమజ్జనంతో లంబాడీ గిరిజనుల తొమ్మిది రోజుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలకు ఘనంగా తెరపడింది.పాల్గొన్నా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముగింపు ఉత్సవాల్లో భాగంగా డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కెరమెరి లో ఏర్పాటుచేసిన ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా లంబాడి మహిళలు, యువతులతో కలిసి, సాంప్రదాయ నృత్యాలు చేశారు.

లింగాపూర్‌మండలకేంద్రంతో పాటు మోతిపట్టార్,కిమానాయక్‌తండా, సిర్పూర్(యు) మండలంలోని ధన్నోరాతాండా,బంజారా సాంస్కృతిక పండుగ తీజ్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రాథోడ్ లలిత రవీందర్ మోతిపట్టార్ గ్రామ నాయకుల, గ్రామ సర్పంచ్ రాటోడ్ సునితా,నేస్రూలసహకారంతో నిర్వహించిన వేడుకల్లో మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సందడి చేశారు. చిన్నారులు సైతం సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. తీజ్ పండుగ విశిష్టత, బంజారా సంస్కృతిలో దాని ప్రాధాన్యాన్ని పలువురు వివరించారు.



లింగాపూర్ సంస్కృతినృత్యాలుయువతులు

## రామడుగు తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

**:మహిళా మోర్చా అధ్యక్షురాలు మాడిశెట్టి శుష్మిత**

**రామడుగు05:** రామడుగు మండలం మాడిశెట్టి పల్లె గ్రామానికి చెందిన బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మాడిశెట్టి శుష్మిత కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ను మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల రెడ్డిని మర్యాద పూర్వకంగా శనివారం కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మహిళ కి 2500/- ఇస్తానని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రామడుగు తాసిల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని అలాగే జీవన భృతి కల్యాణ లక్ష్మి పథకం నిరుకార్చే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి వచ్చేలా పెద్ద ఎత్తున మహిళలతో తాసిల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని రామడుగు మహిళా మోర్చా అధ్యక్షురాలు మడిశెట్టి శుష్మిత తెలిపారు.



# 'గురుదక్షిణ'లో మట్టె రవీందర్ కవిత

## సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో పుస్తకావిష్కరణ

**జననినాదం,మందమర్రి 05:** హైదరాబాద్ బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం 'గురుదక్షిణ' కవితా సంకలనం ఆవిష్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం, అంజిబాబు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ఈ సంకలనాన్ని వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, కవి మట్టె రవీందర్ రచించిన 'మార్గనిర్దేశి' కవిత ఈ సంకలనంలో ప్రచురితమైంది. ఇటీవల 'తీరు తీరు పూలు' కవితా సంకలనంలోనూ ఆయన కవితకు చోటు లభించింది. వరుసగా రెండు కవితా సంకలనాల్లో రవీందర్ రచనలు ప్రచురితం కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంకలనాన్ని ఆవిష్కరించడం విశేషమని, విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు కృతజ్ఞతగా అందించే నిజమైన 'గురుదక్షిణ'గా ఈ పుస్తకం నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, జర్నలిజం, రంగస్థల శాఖాధిపతి బీహెచ్.పద్మప్రియ, జర్నలిజం విభాగం అధ్యాపకులు ఎస్.కళ్యాణ్‌దాస్, సంపాదకవర్గ సభ్యులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 05:** సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని సందర్శించి దివ్యాంగులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరం శిబిరంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు జరగనున్న శిబిరాలకు హాజరయ్యు దివ్యంగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని, జిల్లాలోని అన్ని మండలాల నుండి శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.



# సింగరేణి కార్మికులపై వేధింపులు ఆపాలి

- టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నిరసన హోరు
- సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లు వెంటనే రద్దు చేయాలి
- కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక

**గోదావరిఖని05:** సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన హోరు మిన్నంటింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆర్జీ-1 ఏరియాలోని జిడికే 2 ఇ 2ూ ఇన్క్లైన్ వద్ద ఈ నిరసన ధర్నా చేపట్టారు. వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులపై జారీ చేసిన ఛార్జ్ షీట్లు, సస్పెన్షన్లు, డిస్మిసల్స్ వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి రికార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కారుణ్య మరియు డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీల ఆధారంగా అర్హులైన కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వారికి బకాయిలతో కూడిన పింఛన్ మంజూరు చేయడంతో పాటు క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు



గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 250 గజాల ఇండ్ల స్థలాలు, 100 శాతం ఇన్వాలిడేషన్ ఉద్యోగాలు, ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు వంటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో 19,000 మందికి ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం కోటా ఇచ్చామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, కార్మికులను వేధిస్తూ సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లతో తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో మాదాసి రామ్మూర్తి, నూనె కొమరయ్య, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, దూత శేషగిరి, మేకల సమ్మయ్య, మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తులపై కాకుండా వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లిప్రతినిధి,05:** ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాల తో సన్మానించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం ఉన్న విద్యా వ్యవస్థకు, నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన యుగంలోని విద్యా వ్యవస్థకు ఎంతో తేడా ఉందని అన్నారు. వ్యవస్థ చాలా వేగంగా మారుతున్న నేపథ్యంలో మనం కూడా అందుకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలో వ్యక్తులపై ఆధారపడకుండా, వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరైనా ఉన్నా, లేకపోయినా వ్యవస్థ బలంగా, సమర్థవంతంగా పనిచేసేలా విధానాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తాము ఎప్పుడూ కేవలం నంబర్లు, ర్యాంకుల కోసం ప్రయత్నించలేదని, ప్రక్రియను బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు. ప్రక్రియ సక్రమంగా ఉంటే ఫలితాలు, ర్యాంకులు సహజంగానే వస్తాయని పేర్కొన్నారు. గ త రెండున్నర సంవత్సరాలు గా జిల్లాలోని పలువురు ప్రధానోపాధ్యా యులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులతో నిరంతరం చర్చిస్తూ విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అందరి సమష్టి కృషి, సహకారంతో వ్యక్తులతో సంబంధం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి



మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు. వి ద్యార్థుల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయు తమైన ప్రవర్తన పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన 58 ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి, అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిఎం. షేక్, సెక్టోరియల్ అధికారి, మల్లేశం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరు లు పాల్గొన్నారు.

# 1000 రోజుల ప్రజాపాలనపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు,

## జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ

### ఆరు హామీలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం - శాసనమండలి సభ్యులు దండే విట్టల్

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 05:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, శాసనమండలి సభ్యులు దండే విట్టల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమే కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజాపాలన అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజా క్షేత్రంలో నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పంట రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. అసలైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాసనమండలి సభ్యులు దండే విట్టల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల



పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఇరుకుల మంగ, సంచాలకులు రాంచందర్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రాపర్తి మురళి, పట్టణ అధ్యక్షులు ఇమ్రాన్ హస్మి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తరిఖ్, భీం రావ్, జిల్లా కార్యదర్శి శోభన్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా సమన్వయకర్త కోవా ఇందిరా, ఆసిఫాబాద్ పురపాలక సభా నాయకులు అబ్దుల్లా భాయ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కమల్ నాథ్ రెడ్డి, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బాలేష్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌ను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

## కరీంనగర్‌లో 'యువ సమర భేరీ' అట్టర్ ఫ్లాప్ మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ సెప్టెంబర్ 05:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కరీంనగర్‌లో నిర్వహించిన 'యువ సమర భేరీ' పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయిందని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు యువత సమస్యలను పట్టించుకోని కేటీఆర్‌కు అధికారం కోల్పోయిన తర్వాతే యువత గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌పై విమర్శలు చేసే ముందు కేటీఆర్ తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని అన్నారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రజా పోరాటాలతో ఎదిగిన బండి సంజయ్‌కు, కుటుంబ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన కేటీఆర్‌కు మధ్య ఎంతో తేడా ఉందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ భృతి హామీ, ఉద్యోగ నియామకాలు, పేపర్ లీకేజీలు, 317 జీవో వంటి అంశాల్లో యువత, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ కేంద్రం నుంచి నిధులు



తీసుకురావడంతో పాటు విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధిపై మాట్లాడుతున్న కేటీఆర్ ముందుగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లకు ఎంత నిధులు తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై మాదారం గ్రామ సభలో కీలక చర్చలు

## 2026--27 ఉపాధి హామీ పనులపై ప్రణాళిక..

## అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం

**జననినాదం,తాండూర్ 05:** మాదారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. వి.బి.జి. రామ్‌జీకి సంబంధించి నిర్వహించిన ఈ గ్రామ సభకు గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ శ్రామికులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026--27 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులపై విస్తృతంగా చర్చించారు. గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కుంటల పనులు, ట్రెంచ్ పనులు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్‌లు, పండ్ల తోటల పెంపకం తదితర అభివృద్ధి పనులను చేపట్టే అంశాలపై చర్చించారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాబోయే గ్రామ సభలో అధికారికంగా తీర్మానం చేయనున్నట్లు టీ.ఈ. ప్రసాద్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని




పురస్కరించుకొని గ్రామ సభకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు మీనా, యాదలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల సంరక్షణ, విద్య, పోషణలో అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు బానేష్, లక్ష్మీ, లలిత, రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఉపాధి హామీ సిబ్బంది ప్రసాద్, విజయ్, మేట్ పుష్ప, గ్రామ ప్రజలు, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

# పారమిత విద్యాసంస్థలలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ సెప్టెంబర్ 05:** స్థానిక నగరంలోని పారమిత విద్యాసంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి ఇట్టి వేడుకలను పారమిత పాఠశాలల అధినేత డా: ఇ. ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి చేసి ప్రారంభిచారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు మంత్ర ముగ్ధులను చేశాయి. ఇట్టి కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనది దేశ భవిష్యత్తును మార్చే ఒకే ఒక్క శక్తి ఉపాధ్యాయునిదే. మనం ఈ వృత్తిలో ఉన్నందుకు గర్వపడుతున్నాం. మనశీ మన కర్తవ్యాన్నిగుర్తుంచుకుని, దానికి అనుగుణంగా అడుగులు వేసుకుంటూ అందరికీ ఆదర్శంగా ఉండాలి అని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులు స్వయంగా ఉపాధ్యాయ ఉపాధ్యాయులుగ విదులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి అనుభవాలు పంచుకుంటూ ఉపాధ్యాయ వృత్తి యొక్క ప్రాధాన్యతను, విలువలను వారి వారి మాటల్లో పంచుకున్నారు. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు భారతదేశంలోని ప్రైవేట్,ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు,హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, శ్రీకర్, బాలాజీ, ప్రశాంత్, కవితాప్రసాద్, శర్మిష్ఠ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS**, and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460